1st Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 273 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 16 సెప్టెంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 273 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Tuesday 16 September 2025 PAGES : 8 PRICE : 3/-


# డబుల్ ఇంజిన్ సర్కార్..
# డబుల్ డిజిట్ గ్రోత్.. ఇదే లక్ష్యం

## కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 15)

ఓవైపు అభివృద్ధి చేస్తూనే మరోవైపు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజలు తమపై చూపిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడారు. కొత్తగా వచ్చిన కలెక్టర్లకు ప్రజల తరఫున చంద్రబాబు అభినందనలు తెలిపారు. పాత కలెక్టర్లు కూడా తమ పనితీరును నిరూపించుకోవాలన్నారు."జిల్లా రూపు రేఖలు మార్చే అవకాశం కలెక్టర్లకు ఉంది. పాలసీ ఇవ్వడమే కాదు.. అమలు చేయడం ముఖ్యం. పేదరిక నిర్మూలన లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇంతకుముందు హార్డ్‌వర్క్ ఉండేది. ఇప్పుడు స్మార్ట్ వర్క్ చేయాలి. ఎకో సిస్టమ్ తయారు చేయాలి. భారత్‌ను ప్రథమ స్థానంలో నిలపాలి. మోదీ ప్రధాని అయ్యాక 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్.. నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తయారైంది. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే సమయానికి మన దేశం అగ్రస్థానానికి చేరుకుంటుంది. నిర్దిష్టమైన ఆలోచనతో ముందుకెళ్తే ఏదైనా సాధించగలుగుతాం. 1991కి ముందు సంస్కరణలు రాలేదు. అప్పుడు ఆర్థిక వృద్ధి రెండు లేదా మూడు శాతం ఉండేది. దేశ వృద్ధి రేటును చూసి అప్పుడు కొందరు ఎగతాళి చేసేవారు. టెక్నాలజీపై మాట్లాడితే అవహేళన చేశారు. సంస్కరణలపై -మిగతా 2లో

## మహిళలు వృద్ధిలో భాగం కావడం కాదు.. ముందుండి నడిపించాలి పురందేశ్వరి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 15)

మహిళలు అభివృద్ధిని ముందుండి నడిపిస్తున్నారని భాజపా ఎంపీ, పార్లమెంట్ మహిళా సాధికార కమిటీ ఛైర్‌పర్సన్ పురందేశ్వరి అన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సులో ఆమె ప్రసంగించారు. మారుతున్న సమాజానికి ఈ సమావేశం ఓ నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళలకు సమ న్యాయం, గౌరవ జీవితం ఇచ్చేందుకు ఇలాంటివి ఉపయోగపడతాయని తెలిపారు."వికసిత్ భారత్-2047 సాధనలో మహిళలు ముందుండి నడిపించాలి. విద్య, వైద్యం, పరిపాలన, వ్యాపార రంగాల్లో రాణించాలి. వృద్ధిలో భాగం కావడం కాదు.. ముందుండి నడిపించాలి. ఆశా కార్యకర్తల నుంచి ఐఏఎస్ వరకు మహిళల సంఖ్య పెరుగుతూ ఉంది. వర్క్ ఫోర్స్‌లో వారి సంఖ్య వృద్ధి చెందుతోంది. వారిని వ్యాపార రంగంలో ప్రోత్సహించేందుకు 70 కేంద్ర, 400 రాష్ట్ర పథకాలు ఉన్నాయి. ప్రస్తుత భారత్ ఆర్థిక వృద్ధిలో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు వారి వృద్ధికి ఉపయోగపడేలా మనందరం కృషి చేయాలి. ఇక్కడ నేర్చుకున్న అంశాలను మీ రాష్ట్రాల్లో అమలు చేయాలి. స్వయం -మిగతా 2లో

## గ్రామీణ స్థాయి నుంచే మహిళల నాయకత్వాన్ని ప్రోత్సహించాలి: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,సెప్టెంబర్ 15)

మహిళల భాగస్వామ్యం లేకుండా వికసిత్ భారత్ సాధించలేమని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. కొన్నిచోట్ల పాఠశాలలు దూరంగా ఉండటం వల్ల కొందరు చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. అలాంటి చోట సాంకేతిక సహాయంతో బాలికలు విద్యావంతులు అయ్యేలా చూడాలన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న జాతీయ మహిళా సాధికారత సదస్సులో రెండో రోజు ఆయన మాట్లాడారు. మహిళలను సామాజిక, ఆర్థిక, రాజకీయ, క్రీడా రంగాల్లో మరింత ముందుకి తీసుకు వచ్చేలా రెండు రోజుల పాటు చర్చలు జరిగాయన్నారు."ప్రతి మహిళకు భద్రత, ఆత్మ నిర్భరత అందించాలి. పంచాయతీ స్థాయిలో కంప్యూటర్ సెంటర్ ఉండేలా చూడాలి. ప్రపంచ వ్యాప్తంగా ఐటీ, ఎకనామిక్ రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం సాధిస్తే.. భారత్ ఆర్థికంగా వృద్ధి చెందుతుంది. -మిగతా 2లో

## సమాజ నిర్మాణానికి మహిళలే సరైన ఆర్కిటెక్ట్‌లు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,సెప్టెంబర్ 15)

మహిళా సాధికారత కేవలం మహిళలనే కాదు.. సమాజాన్నీ వృద్ధి పథంలో నడిపిస్తుందని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సు రెండోరోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సతీ సహగమనం, బాల్య వివాహాలు పురాణాల్లో కనిపించవని చెప్పారు. మన వేదాలు, ఉపనిషత్తులు మహిళలను గౌరవించాలని చెబుతున్నాయన్నారు. వారికి గౌరవం లేని చోట ఎన్ని గొప్ప కార్యక్రమాలు చేసినా ఫలితం లేదని పేర్కొన్నారు. "కుటుంబ సంతోషం ఆ ఇంట్లో మహిళల ఆనందంపై ఆధారపడి ఉంటుంది. ఇదే రాష్ట్రానికి, దేశానికి వర్తిస్తుంది. మొల్ల రామాయణం రాసిన కవయిత్రి మొల్లకు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఉంది. కేవలం ఆస్తుల్లో భాగస్వామ్యం లేకపోవడం వల్ల మహిళలు చాలా సార్లు తండ్రి, సోదరుడు, భర్తపై ఆధారపడతారు. పురుషాధిక్యత సమాజంలో వారికి రెండో స్థానం ఇచ్చారు. కానీ సమాజ నిర్మాణానికి మహిళలే సరైన ఆర్కిటెక్ట్‌లు. భారత రాజ్యాంగం అందరినీ సమానంగా గుర్తిస్తుంది. లింగ సమానత్వానికి రాజ్యాంగంలో ప్రాధాన్యత ఉంది. -మిగతా 2లో

## దెబ్బకు దిగొచ్చిన ట్రంప్.. విదేశీ ఉద్యోగులను నియమించుకోండంటూ పోస్ట్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,సెప్టెంబర్ 15)



అమెరికా పరిశ్రమలలో విదేశీ ఉద్యోగుల అవసరం ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు . యూఎస్‌లో పెట్టుబడుల గురించి తాము ఆలోచిస్తామంటూ దక్షిణకొరియా నుంచి హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో అధ్యక్షుడు దెబ్బకు దిగొచ్చారు. ఇంతకీ ఏం జరిగిందంటే..?

ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి అక్రమ వలసల విషయంలో కఠినవైఖరి అవలంబిస్తున్నారు. వారిని గుర్తించి, వెనక్కి పంపిస్తున్నారు. ఇందులోభాగంగానే ఇటీవల -మిగతా 2లో

## మహిళలు ముందుకు వస్తేనే ఏ ప్రాంతమైనా అభివృద్ధి: అయ్యన్నపాత్రుడు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 15)

మహిళలు ముందుకు వస్తేనే ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందుతుందని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. మహిళలను విద్యావంతులను చేయాలని, వారిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ సదస్సులో చర్చించిన అంశాలు కొత్త దిశను చూపిస్తాయన్నారు.



"మహిళలకు అన్ని రాష్ట్రాల్లో సమాన హక్కులు కల్పించాలి. విద్య, ఉపాధి అవకాశాలు అందించాలి. వారు విద్యావంతులైతే వృద్ధి సాధించగలం. ఏటా ఇలాంటి సమావేశాలు జరగాలని కోరుకుంటున్నాను. 3 ఏళ్లలో ఏపీకి రాజధాని సిద్ధం అవుతుంది. అప్పుడు అమరావతిలోనూ ఈ సదస్సు నిర్వహించే అవకాశం ఇవ్వాలి. అందరం కలిసి నడిస్తేనే మహిళా సాధికారత కార్యరూపం దాలుస్తుంది." అని అయ్యన్నపాత్రుడు తెలిపారు.

## వక్ఫ్ చట్టం-2025లో ఓ ప్రొవిజన్ నిలిపేసిన సుప్రీంకోర్టు..

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,సెప్టెంబర్ 15)



వక్ఫ్ (సవరణ) చట్టం-2025లో కీలక ప్రొవిజన్‌ను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కనీసం ఐదేళ్లపాటు ఇస్లాంను అనుసరించిన వ్యక్తి మాత్రమే ఆస్తిని వక్ఫ్ చేయడానికి అవకాశం ఉంటుందన్న దానిని నిలిపివేసింది. ఒక వ్యక్తి ఇస్లాంను అనుసరిస్తున్నట్లు నిర్ణయించేలా నిబంధనలు తయారుచేసేవరకు ఇది అమల్లో ఉండదని చెప్పింది. అదే సమయంలో వక్ఫ్(సవరణ)చట్టం-2025పై మొత్తంగా స్టే విధించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. కొన్ని సెక్షన్లకు మాత్రం కొంత -మిగతా 2లో

## ప్రైవేటీకరణకు పీపీపీకి తేడా తెలియని జగన్

### తెదేపా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 15)



రాష్ట్రంలో వైద్య కళాశాలలు నిర్మిస్తామని జగన్ ప్రభుత్వం రూ.5వేల కోట్ల అప్పు చేసిందని.. ఆ నిధులు ఎటు మళ్లించారో సమాధానం చెప్పాలని తెదేపా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "జగన్ అన్నట్టుగా రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీ చూసి ఆహా అనలేం. వైకాపా కార్యాలయాన్ని మాత్రం ఓహో అనేలా నిర్మించుకున్నారు. ప్రైవేటీకరణకు పీపీపీకి మధ్య వ్యత్యాసం తెలియని జగన్ ఐదేళ్లు సీఎంగా ఎలా పనిచేశారు.

అనేక అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో పీపీపీ విధానంలోనే వైద్య కళాశాలలు కొనసాగుతున్నాయి. పీపీపీ మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా మెరిట్ సీట్లను కూటమి ప్రభుత్వం 42 నుంచి 50 శాతానికి పెంచింది. జగన్ అధికారంలో ఉండగా ఎందుకు పెంచలేదో వైకాపా సమాధానం చెప్పాలి. జగన్ మాపై బురద చల్లేసి కడుక్కోమంటున్నారు. ఫ్యాక్షన్ తరహాలో మెడికల్ కాలేజీల కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల మధ్య జగన్ ఉండటం శ్రేయస్కరం కాదు. రాష్ట్ర శ్రేయస్సు కోసం ఆయన జైలులో ఉండటమే మంచిది. జగన్ తరహాలోనే ఆయన శిష్యులు కూడా ఫేక్ మాటలు మాట్లాడుతున్నారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ రోజురోజుకీ -మిగతా 2లో

## దోమల నివారణకై పాగింగ్ కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 15)**
మండల కేంద్రమైన ఉలవపాడు పంచాయతీ పరిధిలో సోమవారం దోమల నివారణ చర్యల్లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ వారు ఫాగింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ నాగలక్ష్మి, సెక్రటరీ వీరయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వీరేపల్లి గ్రామంలో ఎరువుల వినియోగం పై అవగాహన








**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 15)**
మండలంలోని వీరేపల్లి గ్రామంలో సోమవారం యూరియా వినియోగం తగ్గించి పచ్చి రొట్ట ఎరువుల వినియోగం పెంచుట గురించి రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి. విజయకుమార్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు వాడుటవలన భూమి లో కర్బన శాతం పెరిగి, నేల గుల్లబారి సారవంతం గా మారుతుంది, అలాగే నత్రజని లభ్యత పెరిగి మొక్కలు ఏపుగా పెరిగి అధిక దిగుబడి సాధించడం జరుగుతుంది అని,యూరియా అధిక వినియోగం వలన మొక్కలు ఎక్కువ పచ్చదనం కలిగి పుష్పించడం ఆలస్యం జరిగి ఉత్పత్తి లో నాణ్యత క్షీణిస్తుంది మరియు తెగుళ్ళ , పురుగుల సమస్యలు ఉంటాయి కనుక రైతులు యూరియా వినియోగం తగ్గించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది రమేష్, అరుణమ్మ, వీఏఏ శైలజ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## 28న ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం మహాజన సభ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 15)**
ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం మహాజనసభ ఈ నెల 28వ తేదీన ఒంగోలు ముంగమూరు రోడ్డులో రామచంద్ర మిషన్ దగ్గర అతిధి ఫంక్షన్ హాలు నందు మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు చేసినట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలా హనుమంతరావు ఓ ప్రకటనలో తెలిపారు. యడమైనది. సంఘమునకు సంబంధించిన 2024-25 ఆర్థిక సంవత్సరం యొక్క ఆడిట్ చేయబడిన ఆర్థిక నివేదిక, సంఘ బైలా సవరణ, జామా ఖర్చులు, చేపట్టిన కార్యక్రమాలు సభ్యుల ఆమోదం కొరకు ఈ సమావేశంలో నివేదించబడును. కావున సంఘ సభ్యులందరూ హాజరై ఈ సమావేశమును విజయవంతం చేయాలని ఆయన కోరారు.

**మొదటి పేజీ తరువాయి**

## మహిళలు వృద్ధిలో భాగం కావడం కాదు.. ముందుండి నడిపించాలి పురందేశ్వరి

సహాయక సంఘాలు, ప్రజాప్రతినిధులు ఆయా అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. ప్రతి బాలిక గొప్ప కలలు కనేలా, ప్రతి మహిళా వర్క్‌ఫోర్స్‌లో రాణించేలా కలిసి పనిచేద్దాం" అని పురందేశ్వరి అన్నారు.

## డబుల్ ఇంజిన్ సర్కార్.. డబుల్ డిజిట్ గ్రోత్.. ఇదే లక్ష్యం

మాట్లాడితే చాలా మంది వద్దన్నారు. ఆనాడు సంస్కరణలు వద్దన్న రాజకీయ పార్టీల మనుగడే ఇప్పుడు లేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వం నిర్దిష్టమైన విధానంతో వికసిత్ భారత్-2047 తయారు చేసింది. మనం కూడా స్వర్ణాంధ్రప్రదేశ్-2047 రూపొందించాం.. ఇది అధికారులకు భగవద్గీత, బైబిల్, ఖురాన్ కావాలి. ప్రపంచంలో తెలుగువాళ్లు అగ్రస్థానంలో ఉండాలనేదే నా ఆలోచన. సామాజిక న్యాయాన్ని పరిగణిస్తూ సమర్థతకు పెద్దపీట వేస్తున్నాం. డబుల్ ఇంజిన్ సర్కార్.. డబుల్ డిజిట్ గ్రోత్ లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రస్తుతం వృద్ధిరేటు 10.5 శాతంగా ఉంది. 15 శాతం వృద్ధిరేటు సాధించగలగాలి. 2029 నాటికి రూ.29 లక్షల జీఎస్డీపీ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. అప్పటికి రూ.4.67లక్షల తలసరి ఆదాయం లక్ష్యంగా మనం పనిచేయాలి. ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు పీ4 తీసుకొచ్చాం. ప్రధాని, సీఎం తర్వాత కలెక్టర్లే అత్యంత కీలకమైన వ్యక్తులు. ప్రభుత్వ విధానాలను సక్రమంగా అమలు చేసే బాధ్యత కలెక్టర్లదే" అని చంద్రబాబు అన్నారు.

## గ్రామీణ స్థాయి నుంచే మహిళల నాయకత్వాన్ని ప్రోత్సహించాలి: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

గ్రామంలోని ప్రతి మహిళకు పని కల్పించి, ఆర్థికంగా స్వతంత్రులను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, ఈ కమిటీలు ప్రణాళికలు రూపొందించాలి. దేశంలోని ఆఖరి మహిళకు కూడా ఫలితాలు అందేలా ప్రణాళికలు ఉండాలి. పంచాయతీ, మున్సిపాలిటీ నుంచి పార్లమెంట్ వరకు ప్రతి ఒక్కరూ మహిళల వృద్ధి కోసం కృషి చేయాలి. గ్రామీణ స్థాయి నుంచే మహిళల నాయకత్వాన్ని ప్రోత్సహించాలి. అన్ని రాష్ట్రాల్లో విమెన్ కమిటీలు ఏర్పాటు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థిక, సామాజిక స్వావలంబన సాధించకపోతే మనం వికసిత్ భారత్ కల సాకారం చేసుకోలేం" అని ఓం బిర్లా అన్నారు.

## సమాజ నిర్మాణానికి మహిళలే సరైన ఆర్కిటెక్ట్‌లు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

మహిళలు ఎన్నో సవాళ్లను దాటి రాజకీయ, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో పురుషులకు గట్టి పోటీ ఇస్తున్నారు. సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో వారి హక్కులను కాపాడేలా తీర్పులు ఇచ్చింది. ఆయా తీర్పులు హక్కులను కాపాడటంలోనే కాదు, సమాజ నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషించాయి. ఛత్తీస్‌గఢ్‌లో అత్యధికంగా 14 శాతం మంది మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారు. రువాండాలో 30 శాతం పార్లమెంటరీ సీట్లు కేటాయిస్తూ చట్టం చేసిన కొద్ది కాలానికే అక్కడ వృద్ధి పెరిగింది. భారత రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువ. విద్య ద్వారానే వారికి సాధికారత సాధ్యం అవుతుంది" అని గవర్నర్ అన్నారు.

## దెబ్బకు దిగొచ్చిన ట్రంప్.. విదేశీ ఉద్యోగులను నియమించుకోండంటూ పోస్ట్

జార్జియాలో 475 మంది అక్రమ వలసదార్లను నిర్బంధించినట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకటించింది. జార్జియాలో దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ కంపెనీ ప్లాంట్‌లో దక్షిణకొరియా వాసులు అక్రమంగా పనిచేస్తున్నారన్న సమాచారం ఆధారంగా ఈ రైడ్ జరిగింది. ఇక్కడ అదుపులోకి తీసుకున్నవారిలో ఆ దేశవాసులే ఎక్కువగా ఉన్నారు . ఇది రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలకు దారితీసింది. దీనిపై దక్షిణకొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ స్పందించారు. "ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మా వ్యాపార సంస్థలు యూఎస్‌లో పెట్టుబడులు పెట్టడానికి వెనకాడతాయి" అని హెచ్చరించారు. ఈనేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "సంక్లిష్టమైన ఉత్పత్తులను తయారుచేస్తోన్న విదేశీ కంపెనీలు అమెరికాలో భారీ పెట్టుబడులు పెట్టిన సమయంలో నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరం అవుతుంటారు. కొంతకాలం నిపుణులైన కార్మికులను వారు మా దేశానికి తీసుకురావాలని నేను కోరుకుంటున్నాను. వారి నుంచి మన కార్మికులు శిక్షణ పొందాలి. లేకపోతే ఆ భారీ పెట్టుబడుల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. మేం ఆ విదేశీ సంస్థల ఉద్యోగులను స్వాగతిస్తున్నాం. మేం వారినుంచి నేర్చుకొని, వారికంటే మెరుగ్గా రాణిస్తాం" అని ట్రంప్ రాసుకొచ్చారు.

## వక్ఫ్ చట్టం-2025లో ఓ ప్రావిజన్ నిలిపేసిన సుప్రీంకోర్టు..

రక్షణ అవసరమని వ్యాఖ్యానించింది. వక్ఫ్ బోర్డులో ముస్లిం సభ్యుల సంఖ్య కచ్చితంగా మెజార్టీలో ఉండాలని కోర్టు పేర్కొంది. బోర్డ్ లేదా కౌన్సిల్‌లో అత్యధికంగా ముగ్గురు లేదా నలుగురు ముస్లిమేతర సభ్యులు ఉండాలని చెప్పింది. ఇక చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ముస్లిమే ఉండటం మంచిదని పేర్కొంది. ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టం-2025ను పూర్తిగా నిలిపివేయాలని దాదాపు 100కు పైగా పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. ముస్లింల ఆస్తిని మెల్లగా లాగేసుకొనేందుకే అని వీటిల్లో ఆరోపించాయి. ఇక కేంద్రం మాత్రం పబ్లిక్, ప్రైవేటు ఆక్రణలకు గురికాకుండా రక్షించడానికి అని వాదించింది. వాస్తవానికి ఈ కేసు ఏప్రిల్‌లో పార్లమెంట్ ఈ బిల్లును క్లియర్ చేసిన గంటల్లోనే సుప్రీంకోర్టుకు చేరింది. ముఖ్యంగా కోర్టులతో వక్ఫ్ ఆస్తిగా గుర్తించినవి, వ్యక్తులు, డీడ్ల ఆధారంగా వక్ఫ్ అయిన ఆస్తుల డీనోటిఫై అధికారాలను దీనిలో ప్రశ్నించారు.

## ప్రైవేటీకరణకు పీపీపీకి తేడా తెలియని జగన్

దిగజారిపోతున్నారు" అని ఆదిరెడ్డి వాసు విమర్శించారు. గోదావరి పుష్కరాల పనులు డిసెంబర్ నుంచి ప్రారంభమవుతాయని ఆదిరెడ్డి వాసు తెలిపారు. రూ.1500 కోట్లతో అధికారులు అంచనాలు రూపొందించారన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎన్నికల్లో నాలుగోసారి విజయం సాధించబోతున్నామని చెప్పారు.

## అర్జీలను పరిష్కరించిన అనంతరం ధృవీకరణ పత్రం ఇవ్వాలి

**ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్**






**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, సెప్టెంబర్ 15)**
పీజీఆర్ఎస్ లో నమోదైన అర్జీలను పరిష్కరించిన అనంతరం సంబంధిత వ్యక్తులకు ఖచ్చితంగా ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్ తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం జిల్లా ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్ అధ్యక్షతన సోమవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను విన్నవించారు. తన పరిధిలోని వాటికి ఆయన అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపగా, కొన్నిటిని పరిశీలన, మరికొన్నిటిని విచారణకు ఆదేశించారు. పీజీఆర్ఎస్ లో మొత్తం 164 అర్జీలు నమోదయ్యాయి. పీజీఆర్ఎస్ లో నమోదైన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నందున అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 14,458 అర్జీలు నమోదు అయ్యాయన్నారు. వాటిని ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని ఆదేశించారు. లబ్ధిదారులతో మాట్లాడండి, వారి సమస్య పరిష్కారమైతే లిఖితపూర్వకంగా తెలుగు భాషలోనే వారికి బదులు ఇవ్వాలన్నారు. సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్త పాటించాలని ఇంచార్జి సంయుక్త కలెక్టర్ గంగాధర్ గౌడ్ తెలిపారు. స్వస్తి నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. అందులో భాగంగా అన్ని ప్రాంతాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సచివాలయాల స్థాయిలో వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. ప్రజలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున కాచి వడపోసిన తాగునీరు మాత్రమే తీసుకోవాలన్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, ఉప కలెక్టర్ లవన్న, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసి నాగిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## నగర అభివృద్ధిలో ఇంజనీర్లు భాగస్వామ్యులు కావాలి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 15)**
ఒంగోలు నగర అభివృద్ధిలో ఇంజనీర్లు భాగస్వామ్యులు కావాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు పిలుపునిచ్చారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య 146 వ జయంతి సందర్భంగా ప్రకాశం జిల్లా ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని కేబీ రెస్టారెంట్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమాజంలో ఇంజనీర్లకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. రోడ్లు, బిల్డింగులు, ప్రాజెక్టులు ఇలా ప్రతి నిర్మాణంలోనూ ఇంజనీర్లు కీలక భూమిక పోషిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య కట్టించిన ప్రాజెక్టుల గురించి ప్రస్తావించారు.

ఇంజనీర్లు తమ సంపాదనలో పది శాతం సమాజాభి వృదికి కేటాయించాలని కోరారు. ఒంగోలు నగరాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో ఇంజనీర్లంతా గర్వంగా చెప్పుకునే మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరును ఒక ప్రాంతానికి పెడతామని తెలిపారు. జిల్లా ఇంజనీర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయిస్తానని దామచర్ల జనార్దన్ రావు హామీ ఇచ్చారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ మోక్షగుండం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య కట్టించిన కట్టడాలు చెక్కు చెదరకుండా ఉన్నాయన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ఇంజనీర్లు ముందుకు సాగాలన్నారు. ఇంజనీర్లకు ఇంజనీర్ ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు అని మేయర్ కొనియాడారు. ఒంగోలు నగర అభివృద్ధి చూసే ప్రతి ఒక్కరి నోట ఇదే మాట వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజు, అల్ట్రాటెక్ కంపెనీ ప్రతినిధి గంగరాజు తదితరులు పాల్గొన్నారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, నగర మేయర్ గంగాడ సుజాత పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



## కలెక్టర్‌లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 15)
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో సోమవారం ప్రారంభమైన అన్ని జిల్లాల కలెక్టర్ల కాన్ఫరెన్స్ ను ప్రత్యక్ష ప్రసారం ద్వారా జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, ఇతర అధికారులు ప్రకాశం (తరువాయి 4లో...)

# గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ప్రకాశం జిల్లా పోలీసుల ఉక్కుపాదం



- ఒంగోలు రైల్వే స్టేషన్‌లో రైళ్లలో విస్తృత తనిఖీలు
- సుమారు 15 కేజీల గంజాయి, 75 వేలు నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ప్రత్యేక శిక్షణతో ప్రకాశం జిల్లాలో గంజాయి వేటకు రంగంలోకి రాక్సీ
- రాక్సీ తొలి డ్యూటీలోనే గంజాయి పట్టుకుంది
- శిక్షణకు తగ్గ ప్రతిఫలం
- 10 నెలల పాటు ప్రత్యేక శిక్షణానంతరం
- 5న ప్రకాశం జిల్లాకు కేటాయించిన బెల్జియం మాలినోయిస్
- జాతికి చెందిన రాక్సీ జాగిలం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 15)
గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు, స్పెషల్ పార్టీ, ఈగిల్ టీం, సిబ్బంది, మాదకద్రవ్యాలను గుర్తించే డాగ్ స్క్వాడ్ రాక్సీ తో కలిసి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల బోగీలు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, పార్సెల్

4

## స్మార్ట్ న్యూ రైస్ కార్డులతో బియ్యం పంపిణీ

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, సెప్టెంబర్ 15)
"స్మార్ట్ న్యూ రైస్ కార్డు"ల ద్వారానే బియ్యం పంపిణి జరుగనుందని ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్ తెలిపారు. స్మార్ట్ న్యూ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమం స్థానిక కలెక్టరేట్లో సోమవారం జరిగింది. ప్రభుత్వం నుంచి విడుదలైన స్మార్ట్ న్యూ రైస్ కార్డులను ప్రజల ఇంటి వద్దకే అందిస్తామని ఇంచార్జి సంయుక్త కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 1,123 చౌక ధరల దుకాణాలు నడుస్తున్నాయన్నారు. వాటి పరిధిలో 4,71,382 రైస్ కార్డులు ఉన్నాయన్నారు. ఇక రైస్ కార్డులకు బదులుగా వాటి స్థానంలో స్మార్ట్ న్యూ రైస్ కార్డులను ప్రభుత్వం ఇస్తుందన్నారు. 15వ తేదీ నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించగా ఆమేరకు పంపిణీ ప్రక్రియను ప్రారంభించామన్నారు. జిల్లాకు 4.71 లక్షల స్మార్ట్ న్యూ రైస్ కార్డులు వచ్చాయన్నారు. సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికి వచ్చి అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తారన్నారు. అన్ని ప్రాంతాలలో కార్డుల పంపిణీ జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు ఎంపీడీవోలు పర్యవేక్షించాలని సూచించారు. వీటి వినియోగం కొరకు ఇ-పాస్ యంత్రాలను ఇప్పటికే జిల్లాకు విడుదల చేసిందన్నారు. ఎవరూ ఆందోళన చెందరాదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ పి గ్లోరియా, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అమీర్ బాషా, డి ఎల్ డి ఓ విజయమ్మ, సచివాలయాల కోఆర్డినేటర్ యశ్వంత్, ఉప కలెక్టర్ లవన్న, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. గాలి కుంటు వ్యాధుల టీకాల కార్యక్రమం ఈనెల 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని ఇంచార్జి సంయుక్త కలెక్టర్ గంగాధర్ గౌడ్ తెలిపారు. పశు వైద్యశాఖ రూపొందించిన గోడపత్రాలను సోమవారం ఆయన విడుదల చేశారు. అంటువ్యాధుల నుంచి పశు సంపదను కాపాడటం కోసం నూరు శాతం ఉచితంగానే టీకాలు వేస్తామన్నారు. జిల్లాలో 4.03 లక్షల గేదెలు, ఆవులు, ఎద్దులకు గాలికుంటు టీకాలు వేస్తున్నామన్నారు. పూర్తిస్థాయిలో టీకాలు వేసే కార్యక్రమానికి ప్రభుత్వమే శ్రీకారం చుట్టిందన్నారు. ఈ అవకాశాన్ని పశు పోషకులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు వైద్యాధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్, ఆర్‌డిఓ పి గ్లోరియా, ఉప కలెక్టర్ లవన్న, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.







## మన తెలుగు పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కందుల

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం పట్టణం, సెప్టెంబర్ 15)
మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి "మన తెలుగు" పుస్తకాన్ని స్వగృహంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ నేటి ఇంగ్లీష్ మీడియం చదువుల్లో విద్యార్థులు మాతృభాష తెలుగు ను సరిగ్గా రాయడం, చదవడం రావడం లేదని ఈ పుస్తకాన్ని విద్యార్థులు శ్రద్ధతో పఠనం చేస్తే తెలుగు పై మంచి పట్టు లభిస్తుందని విద్యార్థులకు రాయడం చదవడం తెలుగు సులభంగా వస్తుందని అన్నారు. ఈ పుస్తకాన్ని తర్లుపాడు జగన్నాధపురం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కసెట్టి వెంకట జగన్ రచించి దాతల సాయంతో దాదాపు 1500 పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేయనున్నారని వారు అభినందనీయులు అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుంటక సుబ్బారెడ్డి,



## కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం




భవనము వీడియో కాన్ఫరెన్స్ హాలులో వీక్షించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కాన్ఫరెన్స్‌లో శాఖల వారీగా వివిధ అంశాలపై కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేయనున్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక టైం టేబుల్ ను కూడా రాష్ట్ర అధికారులు రూపొందించారు. ఆయా వివరాలను జిల్లా స్థాయి అధికారులకు తెలియజేసి, ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.

# గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ప్రకాశం జిల్లా పోలీసుల ఉక్కుపాదం

కేంద్రాలు తదితర ప్రదేశాలను పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన పార్సిళ్లు, ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగులు , ఇతర వస్తువులను ఒక్కొక్కటిగా తనిఖీ చేశారు. పూరి నుండి తిరుపతి ఎక్స్‌ప్రెస్ లో ప్రకాశం జిల్లా పోలీస్ లు తనిఖీలు చేపట్టగా గంజాయి వంటి మత్తు పదార్థాలను స్వల్ప పరిమాణంలోనైనా రాక్సీ తన వాసన శక్తితో సులభంగా రైల్లో గంజాయిని గుర్తించింది. సుమారు 15 కిలోల గంజాయి, రూ.75 వేల నగదును స్వాధీనం చేసుకొని, ముజీబ్ రెహమాన్, రేణు లను అదుపులోకి తీసుకున్నారు. అదే అదేవిధంగా ఏడుగురు అనుమానితుల వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం జిఆర్‌పి పోలీసులకు అప్పగించారు. రాక్సీ జాగిలం ముఖ్యంగా వాహనాల తనిఖీలు, బస్సులు, రైళ్లు, లారీలలో దాచిన మత్తు పదార్థాలను గుర్తించడంలో రాక్సీ కీలక పాత్ర పోషిస్తుంది. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను రవాణా చేసే, విక్రయించే, వినియోగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972, డయల్ 112, లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266 కు తెలియజేయవచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు తెలియజేశారు. ఈ తనిఖీలో మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సుధాకర్, ఎస్సైలు శ్రీకాంత్, ఆంజనేయులు, చెంచయ్య, శివరామయ్య, ఆర్పీఎఫ్, జీఆర్పీ ఎస్ఐ మధుసూదన్‌రావు, అధికారులు, ఈగిల్ టీం, సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరాయకొండ ఎస్ఐ మహేంద్ర పై డీజీపీకి ఫిర్యాదు చేసిన నీలం నాగేంద్ర

### ఫోక్సో కేసు ఫాల్స్ చేయాలనుకోవడం గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అవగాహన సదస్సుల స్ఫూర్తికి విరుద్ధం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 15)

ఐదుగురు విద్యార్థినులను లైంగికంగా వేధించిన ముగ్గురు ఉపాధ్యాయులను రక్షిస్తానని కాంట్రాక్ట్ తీసుకుని, పోక్సో కేసును ఫాల్స్ గా రెఫర్ చేయనున్న సింగరాయకొండ ఎస్ఐ మహేంద్ర పై దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డీజీపి హరీష్ కుమార్ గుప్తా కి ఫిర్యాదు చేశారు. సోమవారం ఒంగోలులోని దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాగేంద్ర మాట్లాడుతూ ఎస్ఐ బండ్లమూడి మహేంద్ర ధనవంతుల రక్షకుడు అన్నారు. పోలీసు స్టేషన్ అంటే రక్షణ నిలయం అని, బాధిత విద్యార్థినులకు అన్యాయం చేస్తున్న మహేంద్రకు రక్షణ నిలయంలో ఉండే అర్హత లేదన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డలకు ఇంటి దగ్గర ఉన్నప్పుడు కంటే, స్కూలులో ఉన్నప్పుడే రక్షణ ఉంటుందని భావిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నూటికి 90 మంది ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల బిడ్డలే చదువుతున్నారన్నారు. ప్రభుత్వ బడుల మీద తల్లిదండ్రులకు ఉన్న నమ్మకాన్ని పిల్లి హాజరత్తయ్య వంటి కామాంధుల దుశ్చర్యలు దెబ్బతీస్తున్నాయన్నారు. క్రైమ్ నెంబర్ 174/25 పోక్సో కేసును ఫాల్స్ గా రిఫర్ చేయటంలో కుట్ర ఉందన్నారు. పిల్లి హాజరతయ్య సస్పెన్షన్కు కారణమైన ఐదుగురు విద్యార్థినుల స్టేట్మెంట్ వల్ల మరో ఇద్దరు టీచర్లు చిరుమామిళ్ల సుధాకర్, ఉలిచి సుబ్బారెడ్డిలు సస్పెండ్ అయ్యే పరిస్థితి ఉండడంతో, అయిదుగురు విద్యార్థినుల స్టేట్మెంట్లను మార్చేందుకు ఎస్ఐ మహేంద్ర ప్రయత్నం చేస్తున్నాడని. జూలై 29, జూలై 30 వ తేదీలలో లైంగిక వేధింపులు జరిగాయని చెప్పిన విద్యార్థినులు, 40 రోజుల తర్వాత మాట మార్చారని చెప్పటం సిగ్గుచేటు అన్నారు.



ఫోక్సో కేసు ఫాల్స్ చేయాలనుకోవడం గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ అవగాహన సదస్సుల స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఫిజికల్ డైరెక్టర్ పిల్లి హాజరత్తయ్యపై నమోదైన ఫోక్సో కేసులో వేసిన సెక్షన్ 12 శిక్షా కాలం 3 సంవత్సరాలు మాత్రమే అని, ఈ కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చే అవకాశం ఉందన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన ముగ్గురు ఉపాధ్యాయులను చట్టం నుంచి తప్పించేందుకు, లైంగిక వేధింపులపై పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసిన డిప్యూటీ ఈఓ చంద్రమౌళీశ్వర్ ను ఎస్సై మహేంద్ర వేధించారన్నారు. ఎస్సై మహేంద్ర, డిప్యూటీ ఈఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తును పగడ్బందీగా చేయకుండా, డిఫెన్స్ లాయర్ లాగా నిందితుల తరపున వకాల్తా తీసుకున్నాడన్నారు. కేసును ఫాల్స్ చేయాలంటే బాధితుల స్టేట్మెంట్లను మారిస్తే సరిపోతుందని ఎస్ఐ మహేంద్ర భావిస్తున్నారన్నారు.

ఎస్ఐ మహేంద్ర కేసు దర్యాప్తులో ప్రాసిక్యూషన్కు ఉపకరించే అనేక అంశాలను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేశారన్నారు. ఐదుగురు విద్యార్థినులను వేధించిన పిల్లి హాజరత్తయ్యనే అరెస్టు చేయలేని పోలీసులు, రేపు పులి హాజరత్తయ్యలనేం అరెస్టు చేస్తారని ఎద్దేవా చేశారు. కారుమంచి జడ్పీ హైస్కూల్లో దళిత బాలికను లైంగికంగా వేధించిన ఘటనలో దళిత టీచర్ సుధాకర్ ను ఇరికించాలని చూశారని, ఇదే ఎస్ఐ మహేంద్ర కేసు నిర్ధారణ కాక ముందే సుధాకర్ ని తీసుకొచ్చి పోలీస్ స్టేషన్లో కూర్చోబెట్టారన్నారు. క్రైమ్ నెంబర్ 174/25 పోక్సో కేసు విచారణ బాధ్యత నుంచి ఎస్సై మహేంద్రను తప్పించాలని, రిఫర్ ప్రొసీజర్ ను అడ్డుకోవాలని, కేసు హిస్టరీ తెప్పించుకొని పరిశీలించాలని నాగేంద్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఎస్సై మహేంద్రను ఫోక్సో కేసు విచారణ బాధ్యతల నుంచి తప్పించాలని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొటికలపూడి జయరాం గుంటూరు ఐజి, ప్రకాశం ఎస్పీ, ప్రకాశం కలెక్టర్లకు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు.

## పిఎసిఎస్ భవనానికి స్థలం కేటాయించండి




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, సెప్టెంబర్ 15)

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఆదేశాల మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సొంత భవనము కట్టుకొనుటకు సోమవారం తహసీల్దార్ వి.పుల్లారావుకు వినతి పత్రం అందజేశారు. పొన్నలూరు సంఘం నందు 14 వేల పైచులకు మెంబర్లు, 12 కోట్ల రూపాయలు అవుట్ స్టాండింగ్ రుణములు మంజూరు చేయడం జరిగిందని సంఘం సభ్యులు సామర్థ్యం సంఘమునకు సొంత భవనం ఏర్పరచుటకు ప్రభుత్వ స్థలము 10 సెంట్లు కేటాయించవలసిందిగా కోరుచున్నామని చైర్పర్సన్ కొండలరావు వినతి పత్రం తహసీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, పల్లపోతు రమేష్ బాబు, దాసరి కృష్ణారావు, పల్లపోతు వెంకట్రావు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## మీ కోసంలో వచ్చే ఆర్జీలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల కృష్ణ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 15)

మీ కోసం" లో వచ్చే ఆర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీ కోసం" కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వీటిని ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ద చూపాలని ఆదేశించారు. మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి ఒక్క అర్జీ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులకు చెప్పారు. వచ్చిన ఆర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితిల్లోనూ అర్జీలు పెండింగ్ ఉండరాదని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్ లైన్ లో వచ్చిన వినతులను చూడాలని, అలాగే వచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం చూపుతూ రీఓపెన్ కేసులు రాకుండా చూడాలని ఆయన దిశా నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో బి.చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటి కలెక్టరు కుమార్, జాన్సన్, శ్రీధర్ రెడ్డి, మాధురి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా నూతన ఎస్పీ బి ఉమామహేశ్వర్

### సమస్యలు విన్నవించుకున్న 54 మంది అర్జీదారులు

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, సెప్టెంబర్ 15)



చట్టపరిధిలో విచారించి అర్జీలు పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్, అర్జీ దారులకు భరోసా కల్పించారు. బాపట్ల జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బి ఉమామహేశ్వర్ సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం ద్వారా తమ సమస్యలను జిల్లా ఎస్పీ కి స్వయంగా విన్నవించుకున్నారు. భర్త, అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు తదితర పలు సమస్యలతో 54 మంది అర్జీదారులు పిజిఆర్ఎస్ కార్యక్రమానికి విచ్చేశారు. ఎస్పీ వారితో ముఖాముఖీ మాట్లాడి వారి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అర్జీలను విచారించి చట్ట పరిధిలో పరిష్కరిస్తామని వారికి భరోసానిచ్చారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా చట్టపరంగా విచారించి పరిష్కరించాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. అర్జీదారుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని అధికారులను హెచ్చరించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పీ పి జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఎస్ఐ ఏ నాగేశ్వరరావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.





## నిరుపేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఛైర్మన్ గఫార్ వినతిపత్రం అందజేత




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టెంబర్ 15)

నిరుపేదలను ఆదుకొని అభివృద్ధి చేయడమే ముఖ్య ఉద్దేశ్యమని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. కనిగిరి పట్టణంలో ఇంటి స్థలం లేక ఇబ్బంది పడుతున్న అర్హులైన నిరుపేదలకు జగనన్న లేఅవుట్స్ లో ఖాళీగా ఉన్న ప్రాంతంలో వారికి ప్లాట్లు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, జగనన్న కాలనీ లేఅవుట్లో నిరుపేద ప్రజలు నివాసం ఉంటున్న ఆ ప్రాంతంలో స్మశాన వాటిక లేక చాలా ఇబ్బంది పడుతున్నామని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ దృష్టికి తీసుకురాగా వెంటనే ఆయన స్పందించి సోమవారం కనిగిరి తహసీల్దార్ రవి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. అందుకు తహసీల్దార్ సానుకూలంగా స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

బద్దిపూడిలో రూ.16 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన - వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిన 37 కుటుంబాలు









(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 15)
మండల పరిధిలోని, బద్దిపూడి గ్రామంలో పేదల సంక్షేమం, గ్రామ అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం గ్రామ అభివృద్ధిలో భాగంగా రూ.16 లక్షల ఎంజిఎన్ఆర్ఈజిఎస్ నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్ల నిర్మాణం పూర్తిగా నిలిచిపోయిందని, ప్రజలు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రతి గ్రామంలో రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అదే వేదికపై, బద్దిపూడి గ్రామానికి చెందిన 37 కుటుంబాలవారు వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన పాత, కొత్త నాయకులందరూ కలసికట్టుగా పని చేసి, కందుకూరు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన కొత్త సభ్యులు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం ఆలోచించే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి తాము టీడీపీలో చేరుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఎమ్మెల్యే నాయకత్వంలో గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. పార్టీలో చేరిన కుటుంబాల వివరాలు తాటిపర్తి డేవిడ్, తాటిపర్తి ప్రసాద్, చదలవాడ నిరంజన్, గౌడపేరు ఆరోన్, తాడిపత్రి సువర్ణరాజు, వజ్రయ్య, చెరుకూరి నరసయ్య, కుడుముల యెహోను, చెరుకూరి అయ్యన్న, తాటిపర్తి క్రాంతి, కుడుముల లాజర్, తాడిపత్రి జాన్, సుందరం, చెరుకూరి పెద్ద అబ్రహం, తాడిపత్రి ఏసు, తాడిపత్రి ప్రేమరాజు, తాడిపత్రి చిన్నబాబు, గౌడపేరు ఏసోబు, తాడిపత్రి నరేష్, కుడుముల సుకుమార్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, కూనం రాఘవరెడ్డి, కూనం బ్రహ్మానందరెడ్డి, తాతిరెడ్డి ఆదినారాయణ, అంకమ్మరాజు శ్రీనివాసులు, సందీప్ కుమార్ రెడ్డి, బుల్లికుర వేణుగోపాల్, తిరుపతి రెడ్డి, కృష్ణారెడ్డి, విజయ్, జాజుల రవి, బెల్లం కృష్ణమోహన్, అమ్మనబ్రోలు రమేష్, ఓగుబోయిన యానాది, మద్దసాని మహేంద్ర, చింతల సింగయ్య, తొట్టెంపూడి మాల్యాద్రి, బడితల శివప్రసాద్ తదితరులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువకుడు ఆత్మహత్య








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 15)
ఒంగోలు నగరంలోని పాత మార్కెట్ సెంటర్‌లోని ధరణి లాడ్జిలో నాగులుప్పలపాడు మండలం చౌటపాలెం గ్రామానికి చెందిన కట్టత్రినాద్ 35 సంవత్సరాలు అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. త్రినాథ్ గతంలో మౌర్య మెడికల్స్ లో పార్ట్నర్ గాను, నెల్లూరు బస్టాండ్ వద్ద రమ్య మెడికల్ షాపు నిర్వహించి అందులో నష్టపోయినట్లు తెలుస్తుంది. సోమవారం ఉదయం 9:30 గంటల ప్రాంతంలో వారి స్నేహితులకు తాను సూసైడ్ చేసుకుంటున్నానని మెసేజ్ పెట్టి ధరణి లాడ్జిలో ఫ్యాను కి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వారు స్నేహితులు వెంటనే ధరణి లాడ్జి లోకి వచ్చి పరిశీలించగా ఆయన మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే ఒకటవ పట్టణ పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సంఘటన స్థలాన్ని చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# నడ్డా ఆధ్వర్యంలో విశాఖలో ఫార్మా రంగ స్టేక్ హెూల్డర్స్ సమావేశం

## ఫార్మా, మెడికల్ డివైసెస్ అభివృద్ధి పై డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి విన్నపం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, సెప్టెంబర్ 15)
ఫార్మా రంగ అభివృద్ధి, భవిష్యత్ అవకాశాలపై ఆదివారం సాయంత్రం హెూటల్ దేవి గ్రాండ్ ఇన్ లో జరిగిన స్టేక్‌హెూల్డర్స్ సమావేశానికి కేంద్ర మంత్రి జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఫార్మా పరిశ్రమల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విస్తృత చర్చలు జరిపారు. ఈ కార్యక్రమానికి ఎస్ ఆర్ సి లాబొరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కూడా పాల్గొని మంత్రికి పలు అంశాలపై విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను ఫార్మా రంగంలో జాతీయ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్రం నుంచి మరింత సహకారం అవసరమని కోరారు. పరిశ్రమల విస్తరణతోపాటు మెడికల్ డివైసెస్ తయారీని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ప్రస్తుతం దేశంలో మెడికల్ డివైసెస్ మార్కెట్ సుమారు 12 బిలియన్ డాలర్ల విలువ కలిగి ఉండగా, 2030 నాటికి అది 50 బిలియన్ డాలర్లకు పైగా పెరుగుతుందని అంచనా వేయబడిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ, అనకాపల్లి, కాకినాడ ప్రాంతాలు మెడికల్ డివైసెస్ తయారీకి అనువైన క్లస్టర్లుగా అభివృద్ధి చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. దీని వలన వేలాది కొత్త ఉద్యోగాలు రావడంతో పాటు దేశీయ ఉత్పత్తి పెరుగుదల మరోవైపు ఎగుమతుల వృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఫార్మా వ్యర్థాలను శుద్ధి చేసే కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ బలోపేతం చేసి, పర్యావరణ అనుకూల ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆరోగ్యరంగం ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను చేరుకుంటోందని అన్నారు. ఔషధాల తయారీలో భారత్ ప్రపంచానికి 'ఫార్మసీ ఆఫ్ ది వరల్డ్' గా నిలిచిందని, ఇప్పుడు అదే స్థాయి విజయాన్ని మెడికల్ డివైసెస్ రంగంలో సాధించాల్సిన సమయం వచ్చిందని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర భారీ పరిశ్రమల మంత్రి టీజీ భరత్, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సిఎం రమేష్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# క్విస్ కళాశాలలో ఘనంగా ఇంజనీర్స్ డే ఐడియా థాన్ నిర్వహించిన యాజమాన్యం

## సరికొత్త ఆవిష్కర్ణలతో ముందుకు వచ్చిన విద్యార్థులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 15)
భరతజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఇంజనీర్.. ప్రపంచ ప్రసిద్ధి కట్టడాల రూపశిల్పి.. అద్భుత ఆనకట్టలు, వంతెనలు, రహదారుల నిర్మాత మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డైకిన్ ఎయిర్ కండీషనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ జోషి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంజనీర్స్ డే సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. దాంట్లో భాగంగా నిర్వహించిన ఐడియాథాన్ కి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. దాదాపు 60 సరికొత్త ఐడియాలు, ప్రాజెక్ట్ లతో విద్యార్థులు ఐడియాథాన్ లో పోటీపడ్డారు. విద్యార్థుల ఐడియాలను పరిశీలించిన ఒంగోలుకు చెందిన జాజీ టెక్నాలజీస్ కంపెనీ ప్రతినిధులు విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్ లు, ప్రోటోటైప్ లను పరిశీలించి వారికి బహుమతులు అందజేశారు. ఈ ఐడియా థాన్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్విస్ విజార్డ్స్ తేజస్విని టీమ్ కి మొదటి బహుమతి, బీ సాల్వ్ పి మహీంద్ర టీమ్ కి రెండో బహుమతి, సైబర్ షీల్డ్ ఎస్ కె. ఇమ్రాన్ టీమ్ కి మూడో బహుమతి అందజేశారు. ఈ ఐడియాథాన్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని స్మార్ట్ ఇండియా హ్యాక్ థాన్ కి పంపించనున్నట్లు డీపీఎస్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు తెలియజేశారు. క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ప్రాజెక్ట్ లకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, దాని ద్వారా విద్యార్థులకు నైపుణ్యాలు మెరుగుపడతాయని విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి అన్నారు. ఈ సందర్భంగా అందరికీ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, డీన్ లు, డైరెక్టర్లు, హెచ్ వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సీఎస్ సీడీఈ డీన్ డాక్టర్ భార్గవ్ అండ్ టీమ్ పర్యవేక్షించారు.



# అంటువ్యాధులు ప్రబలకుండా సర్వే





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 15)
మండల పరిధిలోని కరేడు 1, 2, 3, ఉలవపాడు 1, 2, 3 ఆత్మకూరు సచివాలయాల పరిధిలో గ్రామాలలో అంటూ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా లార్వా సర్వే , ఫీవర్ సర్వే నిర్వహించారు. పనికిరాని వస్తువులు లేదా వారిని వస్తువులలో నీరు నిల్వ ఉన్న పరిశీలించడం, నీరు నిల్వ ఉన్న వాటిని తొలగించడం అలాగే వారానికి ఒకరోజు నీటిని శుభ్రపరచినందున దోమల ఆవాసాలు లేకుండా చేయవచ్చు నని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. వర్షాభావం వల్ల మనం వాళ్ళని వస్తువులలో నీరు ఉన్నచో వాటిలో డెంగ్యూ దోమ గుడ్లు పెట్టి అవి దోమలుగా తయారయ్యే అవకాశం ఉన్నందున డెంగ్యూ దోమ(ఏ డిస్ ఈజిప్ట్) దోమ కుడితే డెంగ్యూ వ్యాధిన పడే అవకాశం ఉన్నందున ఎక్కడ నీటి నిల్వలు ఉంచకూడదని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరేడు వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ పర్యవేక్షించడం జరిగింది. అలాగే కందుకూరు సబ్ యూనిట్ ఆఫీసర్ రామారావు కూడా పర్యవేక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది మరియు సూపర్వైజర్లు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

# జాతీయ సేవా రత్న అవార్డు అందుకున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, సెప్టెంబర్ 15)
విజయవాడలోని అక్కినేని నాగేశ్వరరావు ఆడిటోరియంలో జరిగిన మదర్ సర్వీస్ సొసైటీ మూడవ వార్షికోత్సవం సందర్భంగా వేరు వేరు రాష్ట్రాలలో స్వచ్ఛందంగా సేవ చేస్తున్నటువంటి వారికి అవార్డ్స్ అందించడం జరిగింది. ఈ అవార్డ్స్ ఫంక్షన్ లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్, బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులకు జాతీయ సేవా రత్న అవార్డ్ సినిమా హీరోయిన్ కుమారి రజిత షాండే మల్లాడి ప్రసాద్ చేతుల మీదుగా అందించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపకులు మల్లాడి ప్రసాద్ మాట్లాడుతూ బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు స్వచ్ఛందంగా అనాధ శవాలకి అంత్యక్రియలు నిర్వహించటం, మిగులు భోజనాలు పంపిణీ చేయడం, చెట్లు నాటే కార్యక్రమాలు, పేద పిల్లల విద్యకు సంబంధించిన విద్యా సామాగ్రి అందిచడం, అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆధ్యాత్మికంగా యోగా క్లాసులు చేపిస్తూ ప్రపంచ ఆధ్యాత్మిక గురువులు రవిశంకర్ గురూజీ దగ్గర శిష్యులుగా ఉండటం ఇంకా పలు రకాల సేవలు చేస్తున్నందుకు ఈ అవార్డ్ అందించినందుకు తనకు మా సంస్థ సభ్యులకు చాలా ఆనందంగా ఉందని కొనియాడారు. అవార్డ్ అందుకున్న నారాయణరెడ్డి మాట్లాడుతూ సంస్థ వ్యవస్థాపకులు మల్లాడి ప్రసాద్ కు నేను చేస్తున్న సేవలను గుర్తించి జాతీయ సేవా రత్న అవార్డ్ అందించినందుకు ఆయనకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ గిద్దలూరు బద్వేల్ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకృతి ఎస్ ఎస్ చైర్మన్ కటారు రమాదేవి, భారతీయ జనతా పార్టీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సుశీల రెడ్డి , దాదాపు 150కి పైగా ఎన్జీవో సంస్థల యజమానులు పాల్గొన్నారు.



# తెలుగులో రాయడం, చదవడంలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక అభ్యసనా దీపిక

## ఆవిష్కరించిన ఎమ్మెల్యే కందుల







(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, సెప్టెంబర్ 15)

మండలంలోని జగన్నాథపురం మండల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న కస్సెట్టి వెంకట జగన్ బాబు రూపొందించిన ప్రత్యేక దీపికను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ జగన్‌బాబు నిబద్ధతతో విధి నిర్వహణను నిర్వహిస్తూ సామాజిక సేవ తత్పరత గుణం కలిగినవారన్నారు. విద్యార్థులు తెలుగులో రాయడం, చదవడం రాని వారికి సులువుగా ఉండేందుకు ఒక ప్రత్యేక దీపికను ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. దాతల సహకారంతో సుమారు 1500 పుస్తకాలను ప్రింట్ చేయించడం ఉచితంగా తెలుగులో వెనుకబడిన మార్కాపురం, తర్లుపాడుమండల విద్యార్థులకు అందజేయడం అభినందనీయం అన్నారు. వృత్తితో పాటు, తెలుగులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి క్రమ పద్ధతిలో అక్షరాలను క్రమబద్ధీకరించి సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో స్వచ్ఛందంగా, ఓర్పు, నేర్పుతో దీపికలు తయారు చేసి విద్యార్థులకు అందించడం శుభ పరిణామం అని జగన్‌ను అభినందించారు. విద్యార్థులు తెలుగులో సులువుగా రాయడం, చదవడానికి తయారు చేసిన దీపికను ముద్రించడానికి దోహదపడిన దాతలైన పెరుమాళ్ళ బాలమోహన్‌రావు, అన్నా రాము, ఆవుల వెంకటేశ్వర్లు, గాయం శ్రీనివాస్‌రెడ్డి, కసెట్టి బాల వెంకట సత్యనారాయణ, చేతుల శ్రీనివాసులు, సొల్లేటి శ్రీధర్, కే స్వాతి, కొడాలి హరీష్, పేర్ల సురేష్, టెక్కలి బాలు, కొలిపాకుల వెంకటేశ్వర్లు, రాచమడుగు వెలుగొండస్వామి, పినాకపాణి తదితర దాతలనందరిని అభినందించారు. ఈయనతో పాటు మార్కాపురం నియోజకవర్గ జనసేన ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్ కూడా జగన్‌ను అభినందించారు. ఇదే దీపికను ముందుగా తర్లుపాడు మండల ఎంఈఓలు డి సుజాత, ఏ సుబ్బారావు, మార్కాపురం ఎంఈఓ రాందాస్ నాయక్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు సంయుక్తంగా మాట్లాడుతూ అంకితభావంతో విద్యావృత్తి చేపడుతూ, సామాజిక కార్యకర్తగా సేవలు చేయడం గొప్ప విషయం అన్నారు. అంతేగాక మండల పరిధిలోని ఏ పాఠశాలలో వృత్తిని అవలంబిస్తున్నప్పటికీ ఆ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, విద్యాభివృద్ధికి కృషి చేయడం, సేవ వృత్తిలో నేను సహితం అంటూ ముందుకు రావడం ఇది ఆయన దైనిక జీవితంలో ముందుకు రావడం గొప్ప విశేషమని ఆయన అభినందించారు.

## గార పెంటలో ప్రత్యేక ఆధార్ క్యాంపు





(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, సెప్టెంబర్ 15)

ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజా బాబు, ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్ కె వెంకట శివ ప్రసాద్ ఆదేశాల మేరకు పుల్లలచెరువు తహశీల్దార్ కె వెంకటేశ్వరరావు, ఎంపీడీవో యం. మరియదాసు సహకారంతో పుల్లలచెరువు మండలం గారపెంట చెంచు గిరిజన వాస స్థలాల్లో ఆధార్ నమోదు, సవరణల కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. అసిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో సెప్టెంబర్ 15న సోమవారం గారపెంట గ్రామంలో ఈ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా చెంచు గిరిజన కుటుంబాల వారికి ఆధార్ ఇవ్వడమే లక్ష్యంగా అధికారులు పెట్టుకున్నారని వివరించారు. గిరిజనులకు ఆధార్ కార్డు ఉంటే ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల లబ్ధి పొందడం సులభమని తెలిపారు. అసిస్ట్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ గిరిజన నివాస స్థలాల్లో ఇలాంటి ప్రత్యేక శిబిరాలు మరిన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ క్యాంప్‌లో కొత్తగా 34 మంది, సవరణలు 9 మంది ఆధార్ నమోదు చేసుకుని సద్వినియోగం చేసుకున్నారని వారు తెలిపారు. ఆధార్ కార్డ్ లేని ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు అందజేస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ తాటి లక్ష్మీదేవి, అసిస్ట్ సంస్థ పుల్లలచెరువు ఫీల్డ్ కోఆర్డినేటర్ యన్ హనుమంతరావు, ఎర్రగొండపాలెం ఫీల్డ్ కోఆర్డినేటర్ దారా వెంకట్రావు, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ యన్ రాజ్యలక్ష్మి, కె సామ్యూల్, పి పోలయ్య, బి కామ్లా నాయక్, వెంకటేశం, బాల లక్ష్మీబాయి, లక్ష్మీబాయి, ఐటీడీఏ సభ్యులు, పొదుపు గ్రూప్ మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. గారపెంట గ్రామంలో ప్రత్యేక ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేసినందుకు ఐటిడిఎ శ్రీశైలం వారికి చెంచు గిరిజనులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపి హర్షం వ్యక్తం చేసారు.

## అల్లీనగరం జిల్లా పరిషత్ హైస్కూల్లో హిందీ దినోత్సవం



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, సెప్టెంబర్ 15)

కొమరోలు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అల్లీనగరంలో హిందీ దినోత్సవ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు పద్మజ అధ్యక్షత వహించారు. పాఠశాల హిందీ ఉపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అయిన మొర్రి. పిచ్చయ్య ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు హిందీ దినోత్సవంకు సంబంధించిన వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించడం జరిగినది. తదనంతరం వ్యోహార్ రాజేంద్రసింహ్ చిత్ర పటానికి పూలమాల అలంకరించి పాఠశాల సిబ్బంది నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యయురాలు మాట్లాడుతూ హిందీ రాజభాషతోపాటు జాతీయ భాషగా భారత రాజ్యాంగం గుర్తించిందన్నారు. హిందీ ఉపాధ్యాయులు పిచ్చయ్య మాట్లాడుతూ వ్యోహార్ రాజేంద్ర సింహ్ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్పూర్ లో 14 సెప్టెంబర్ 1900 సంవత్సరంలో జన్మించారని, వీరు హిందీ భాష కు ఎనలేని కృషి చేసినందున ఆయన పుట్టినరోజు అయిన సెప్టెంబర్ 14న ప్రతి సంవత్సరం జాతీయ హిందీ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ప్రపంచంలో ఎక్కువ మంది మాట్లాడే 3వ భాషగా హిందీ ఉందని, హిందీ భాష ప్రచారానికి మహాత్మా గాంధీ కృషి చేశారన్నారు. హిందీ నేర్చుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి అన్నారు. ఇప్పటివరకు హిందీలో 12 మంది కవులు జ్ఞానపీఠ అవార్డులు పొంది మొదటి స్థానంలో రికార్డు సాధించిందన్నారు. నిర్వహించిన పోటీలలో విజేతలకు హెచ్.ఎం చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేసి, మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్ఎంఆర్ వేతనాల సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవోకు వినతిపత్రం



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, సెప్టెంబర్ 15)

మండలంలోని పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు (గ్రీన్ అంబాసిడర్స్, ఎన్ఎంఆర్ ) పెండింగ్ వేతనాల సమస్యను పరిష్కరించాలని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హనుమంతునిపాడు ఎండిఓకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి తొలత మండలంలోని పరిస్థితి కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం సిహెచ్ ఆవులయ్య అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హనుమంతునిపాడు మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు గత ఐదు సంవత్సరాల కాలం నుండి పెండింగ్ వేతనాలు ఉన్నాయని సంవత్సరాల తరబడి వేతనాలు ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయించుకోవడం అత్యంత దారుణమైన విషయమన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతినెల వేతనాలు తీసుకుంటుంటే ఎట్టి చాకిరి చేసే కార్మికులు మాత్రం సంవత్సరాల తరబడి వేతనాలు ఇవ్వకుంటే వాళ్ల కుటుంబాలు ఏం తిని బతకాలని ప్రశ్నించారు గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ సర్పంచి మరియు పంచాయతీ కార్యదర్శి వేతనాలు చెల్లించే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు ఆమోదం లేకుండా మేము బిల్లులు పెట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తపరుస్తున్నారని తెలిపారు. పంచాయతీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికుల పట్ల రాజకీయ కోణాన్ని పరిశీలించడం ద్వారా వేతనాలు పొందటం లేదని తెలిపారు. ప్రభుత్వం నేరుగా పారిశుద్ధ్య కార్మికునికి అకౌంట్లో వేతనం పడేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం ప్రకటించిన రూ.6000 వేతనంతో పాటు హెల్త్ ఓహెచ్ఏ రూ.4000తో కలిపి మొత్తం రూ.10 వేలు ప్రతినెలా చెల్లించాలని ప్రభుత్వ ఆదేశాలు జీవో ఎంఎస్ నెంబర్ 75, 21.6.25 ఉన్నప్పటికీ అమలు జరగటం లేదన్నారు. కనీస వేతనం రూ.26,000 కార్మిక వర్గం డిమాండ్ చేస్తుంటే రూ.21,000 ఇవ్వాలన్న హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం నామమాత్రం వేతనాలు ఇస్తున్నారని ఇవి కూడా సంవత్సరాల తరబడి పెండింగ్ పెడుతున్నారని కార్మికులను రికార్డుగా గుర్తించి సచివాలయ సిబ్బంది హాజరు పట్టికలో పారిశుద్ధ్య కార్మికుని పేరు కూడా నమోదు చేసి రోజువారి హాజరు వేసే విధంగా రికార్డుగా రిజిస్టర్ హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్ల కాలంలో పారిశుద్ధ్య కార్మికులను ఉపయోగించుకొని పనిచేయించుకుని వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులు గురిచేసారని, గతంలో పని చేయించుకొని ప్రభుత్వం మారుతున్న వెంటనే తొలగించినటువంటి కార్మికులకు వేతనాలు కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే కార్మికులను సమీకరించి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 20 గ్రామాల నుండి గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



## బాల్ బ్యాడ్మింటన్ విజేతలను అభినందించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవి



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, సెప్టంబర్ 15)

ఏపీ 10వ జూనియర్ (అండర్ 19) బాలికల బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ టోర్నమెంట్ ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టు విజయం సాధించగా జట్టు సభ్యుల్లో 10 మందిలో 7 గురు బాలికలు వినుకొండ నియోజకవర్గం శావల్యాపురం మండలానికి చెందినవారు. వారిలో శానంపూడికి చెందిన ఆకుమల్ల సమీరా, శావల్యపురానికి చెందిన కామినీడి కావ్యలు స్టార్ ఆఫ్ ఆంధ్ర అవార్డుతో పాటు అక్టోబర్ నెలలో తమిళనాడులో జరిగే జాతీయ పోటీలకు ఏపీ జట్టు నుండి ఎంపికయ్యారు. వీరందరినీ ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు అభినందించి విజేతలకు క్యాష్ ప్రైజ్ అందజేశారు. కార్యక్రమంలో పిడి రాధాకృష్ణమూర్తి, పిఈటి ఝాన్సీ, బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ జోన నాయక్, జిల్లా సెక్రెటరీ వై శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## పనివారాన్ని తగ్గించాలి ఎంపీడీవోకు సచివాలయ సిబ్బంది వినతిపత్రం అందజేత



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, సెప్టెంబర్ 15)

మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక సచివాలయంలో పనిచేస్తున్న కార్యాలయ సిబ్బంది పని భారాన్ని తగ్గించాలని ఎంపీడీవో చంద్రశేఖర రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూరాష్ట్రప్రభుత్వం ప్రజాభివృద్ధి కొరకుచేపట్టినసంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు సర్వేలు నిర్వహించడం, వారికి అందించడం లాంటి పనుల వలన వారి వృత్తితో పాటు ఈ పనులన్నీ చేయడం, అధికారుల ఒత్తిడితో వారికి పని భారం ఎక్కువై అనారోగ్యాలకు గురవుతున్నామని ఆవేద వ్యక్తం చేశారు. వారికి రావలసిన ఇంక్రిమెంట్లు పెంచాలని, ప్రమోషన్లు కల్పించాలని వినతిపత్రంలో రాతపూర్వకంగా తెలిపారు. వీరి సమస్యల పట్ల సంబంధిత అధికారులు వెంటనే చొరొ చూపి తగినన్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కళా ఉత్సవ్ జిల్లా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, సెప్టంబర్ 15)

పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో జిల్లా విద్యా శిక్షణా సంస్థ బోయపాలెంలో నిర్వహించిన కళా ఉత్సవ్ 2025 పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. నాటకం విభాగంలో గిడుగు ఏకపాత్రాభినయం ప్రదర్శించిన పదో తరగతి విద్యార్థి ఇవివి శ్రీలక్ష్మి కి ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో మూడవ బహుమతి లభించింది. శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, జానపద నృత్యంలో విద్యార్థులు పాల్గొని ప్రశంసలు పొందారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతి పొందిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు బి శైలజ, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెరగడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు గైడ్ ఉపాధ్యాయినిగా డాక్టర్ వి పద్మ వ్యవహరించారు.





# శ్రీ హర్షిణి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మహిళా కళాశాలలో ఇంజినీర్స్ డే







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 15)**

ప్రముఖ భారతీయ ఇంజినీర్, భారత రత్న డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతిని పురస్కరించుకొని శ్రీ హర్షిణి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మహిళా కళాశాల, ఏడుగుండ్లపాడు (ఒంగోలు)లో ఇంజినీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కళాశాల సెమినార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని పోస్టర్ ప్రెజెంటేషన్, సెమినార్లు, వివిధ సాంకేతిక పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్, డీన్ డాక్టర్ డి అంజనేయులు, డైరెక్టర్ గోరంట్ల హర్షిత్, వైస్ ప్రిన్సిపల్ కె సుధీర్ చక్రవర్తి, హెచ్ఓడీ పి శ్రీదేవి, అధ్యాపకులు మణికంత, పార్విన్, ఐషిల్, పవన్, రాము, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. ప్రధాన అతిథిగా ఛైర్మన్ జి రవికుమార్ మాట్లాడుతూ డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవిత చరిత్ర, వారి కృషి, దేశానికి అందించిన సేవల గురించి వివరించారు. వేదిక పై ఉన్న ఇతర మేధావులు కూడా ఇంజినీరింగ్ రంగానికి సంబంధించి విలువైన సందేశాలను విద్యార్థినిలతో పంచుకున్నారు. అనంతరం పోటీల్లో విజయం సాధించిన విద్యార్థినులకు బహుమతుల పంపిణీ జరిగింది. అనంతరం ఏడబ్ల్యూఎస్ ఇండియాలో క్వాంటమ్ కంట్రీ లీడ్‌గా సేవలందిస్తున్న డా. అంజని ప్రియదర్శిని వడిగినేని గౌరవ అతిథిగా హాజరై, "క్వాంటం కంప్యూటింగ్ – ప్రస్తుతమూ, భవిష్యత్తులో ప్రాముఖ్యత" అనే అంశంపై విజ్ఞానప్రదమైన లెక్చర్ అందించారు. ఆమె ప్రసంగం విద్యార్థినుల్లో కొత్త ఆలోచనలకు, పరిశోధనాత్మక దృక్పథానికి ప్రేరణనిచ్చింది. చివరిగా కళాశాల తరపున అధ్యాపకులు డా. అంజని ప్రియదర్శిని గారిని ఘనంగా సన్మానించారు. ఆమె పోటీల్లో విజయం సాధించిన విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం విద్యార్థినులకు సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనా దృక్పథం, ప్రొఫెషనల్ నైతికత వంటి అంశాలపై అవగాహన కల్పించడంతోపాటు, వారి భవిష్యత్ విజ్ఞాన ప్రయాణానికి మార్గదర్శిగా నిలిచింది.

# సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 15)**





సంతనూతలపాడు నియోజకవర్గంలో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజురైన 394 మందికి 2 కోట్ల 23 లక్షల 93 వేల రూపాయల మరో 4 రోజుల్లో సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ లబ్ధిదారుల ఇంటి వెళ్లి అందచేయనున్నారు. సోమవారం మద్దిపాడు మండలంలోని 21 గ్రామాలలో 85 మందికి 59 లక్షల 55 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందచేసి గ్రామాలలో వున్నా సమస్యల గురించి తెలుసుకుంటూ రోడ్డు, సైడ్ డ్రైన్స్ లను పరిశీలించారు, బి. ఎన్. విజయ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులు ఇస్తున్నారా అనేది కూడా తెలిసేది కాదు అని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదల కు వైద్య ఖర్చు కోసం చెక్కులను ఇవ్వడం జరుగుతుందని, అలాగే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ సెక్రటరీ ఆడాక స్వాములు ,మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మద్దిపాడు మండలం మాజీ తెలుగు యువత అధ్యక్షులు పోతినేని శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు గట్టినేని అయ్యన్న, నియోజకవర్గ సలహాదారులు మండవ జయంత్ బాబు, మండల సెక్రటరీ మందపల్లి శ్రీనివాసరావు, మన్నం కృష్ణ, మార్నెని రాఘవ, కృష్ణారావు, దుగ్గినేని నరసింహారావు, రామకృష్ణ, గడ్డం రవి, అద్దేపల్లి దుర్గ భవాని ,ముప్పా రవి, ప్రభాకర్‌రెడ్డి, రాయపాటి శ్రీనివాసరావు, కృష్ణమోహన్‌రెడ్డి, భావన్నారాయణ, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# పోలీస్ గ్రీవెన్స్‌కు 58 ఫిర్యాదులు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 15)**

ప్రజల నుండి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కారించుటయే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ కె నాగేశ్వరరావు పర్యవేక్షణలో పోలీస్ అధికారులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో "మీకోసం" నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదులను పోలీస్ అధికారులు స్వీకరించి వారితో ముఖాముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. అందిన ప్రతి పిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వర పరిష్కారం కల్పిస్తామని బాధితులకు భరోసా కల్పించారు. అదేవిధంగా అందిన ఫిర్యాదుల వివరాలను సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేసి, త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా భూ వివాదాలు, ఉద్యోగ మోసాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, చీటింగ్ కేసులు మరియు ఇతర సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. ప్రజల విశ్వాసం పెంపొందించడమే కాకుండా బాధితులకు తక్షణ సహాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ రమణ కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్, ఎస్సీ,ఎస్టీ సెల్ ఇన్స్‌పెక్టర్ దుర్గాప్రసాద్, సీసీయస్ ఇన్స్పెక్టర్ జగదీష్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ పాండు రంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐ జనార్ధన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.







# ఆకలి తీరుస్తూ ఆదరణ చాటిన స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్







**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టెంబర్ 15)**

కనిగిరిలో స్నేహహస్తం ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి కనిగిరిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం రోజున స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమం ద్వారా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, వారి బంధువులకు, నిరాశ్రయులకు, మతిస్థిమితం లేని వృద్ధులకు ఆహారం అందించారు. ట్రస్ట్ అధ్యక్షులు సుధీర్‌బాబు మాట్లాడుతూ ప్రతి సోమవారం గర్భిణీలు, బాలింతలు, డయాలసిస్ చేయించుకునే కిడ్నీ వ్యాధిగ్రస్తులు, పేద ప్రజలకు మా వంతు సేవ అందిస్తాం. ఆకలితో ఉన్న పేదవారికి, ఆహారం ఇవ్వడం మా బాధ్యతగా భావిస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, స్నేహహస్తం సభ్యులు అక్బర్ వలి, గౌస్, మోహన్ కుమార్, ఖాసీం పీరా, తదితరులు పాల్గొన్నారు.

# జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ఇంజినీర్స్ డే






**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, సెప్టెంబర్ 15)**

స్థానిక డాక్టర్ శ్యామ్యూల్ జార్జ్ అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ అధ్వర్యంలో భారత రత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల విశ్వేశ్వరయ్య భవన్ ప్రాంగణంలో గల విశ్వేశ్వరయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా స్మరించుకుంటూ 58వ ఇంజనీర్స్ డే వేడుకలు జరిగాయి. ఈ సంవత్సరం డీప్ టెక్ అండ్ ఇంజనీరింగ్ ఎక్సలెన్స్, డ్రైవింగ్ ఇండియాస్ టెక్ యెడ్ అనే థీమ్‌తో ఇంజనీర్స్ డే ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల టెక్నికల్ అడ్వైసర్ మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ విద్యార్థినీ విద్యార్థుల కు ఇంజినీర్స్ డే శుభాకాక్షలు తెలిపారు. ఈ సంద్భంగా వారు తమ సందేశంలో ఇంజనీర్ల మేథోసంపత్తికి దర్పణంగా రూపుదిద్దుకున్న నిర్మాణాలు దేశ ప్రగతికి ప్రతీకలు. అటువంటి ఎన్నో నిర్మాణాలను జాతికి అందించి దేశంలో ఎన్నో ప్రాంతాలు సుభిక్షంగా తులతూగడానికి కారణమైన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, ఈశ్వరరావు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య, అధ్యాపక, అధ్యపకేతర సిబ్బందితో పాటు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.


# స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజలకు బహుళ ప్రయోజనాలు

## రేషన్ ఇబ్బందులకు 1967 టోల్‌ఫ్రీ నంబర్‌తో పరిష్కారాలు
## వినుకొండలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, సెప్టంబర్ 15)**





రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ప్రవేశ పెడుతోన్న స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజలకు బహుళ ప్రయోజనాలు లభిస్తాయని వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. టెక్నాలజీ సాయంతో ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థనూ పూర్తి పారదర్శకంగా, లోపరహితంగా తీర్చిదిద్దుతోందన్న ఆయన ఆ విషయంలో ఎలాంటి ఇబ్బందులున్నా ప్రజలు వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1967కి ఫిర్యాదు చేయాలని సూచించారు. వినుకొండలో సోమవారం స్మార్ట్‌రేషన్‌కార్డుల పంపిణీ చీఫ్‌విప్ జీవీ ప్రారంభించారు. స్థానిక 12వ వార్డు అంబేడ్కర్‌కాలనీలో లబ్దిదారులకు కార్డులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో 30 వేల వరకు రేషన్ దుకాణాలు సేవలు అందిస్తున్నాయని, మొత్తం 1.43 కోట్లమందికి ఈ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ప్రతినెలా ప్రభుత్వం ద్వారా పేదలకు చౌకబియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నామని, ఈ పథకాన్ని ఇంకా సమర్థంగా అమలు చేయడం కోసం లబ్ధిదారుల ఇంటి గడపకు చేరేలా ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నారన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు ఉంటే రాష్ట్రంలో ఏ జిల్లాలోనైనా బియ్యం, సరకులు తీసుకొచ్చని చెప్పారు. గతంలో లాగా దుకాణాల వద్ద కార్డుదారులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన అవసరం లేదన్నారు. రేషన్ డీలర్లకు అధునాతన ఈ-పోస్ యంత్రాలను పంపిణీ చేస్తున్నామని, వేగంగా పంపిణీ చేయడానికి వారికి చాలా సులభతరం అవుతుందన్నారు. మంత్రి నారా లోకేష్ తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 650కిపైగా సేవలు అందించడం ఎంతో అభినందనీయమన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు సులువుగా సేవలు అందించే విధానాల కోసం ఎప్పుడైనా ఖర్చు పెటిందా అని ప్రశ్నించారు.జిడిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు రావు జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**వైకాపా ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలి:** ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలకు విపక్ష వైకాపా ఎమ్మెల్యేలు హాజరు కావాలని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఎన్డీఏ ప్రభుత్వంలో సమావేశాలు చాలా అర్థవంతంగా ఉంటున్నాయని, గతంలో ఉన్నట్లు గందరగోళాలు, దూషణలు లేవని, ఏ విషయంపై అయినా అర్థవంతమైన చర్చలకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజల పట్ల వైసీపీ ఎమ్మెల్యేలకు ఏమాత్రం గౌరవం ఉన్నా ప్రజా సమస్యలపై మాట్లాడాలని హితవు పలికారు. సమస్యలపై చర్చిద్దామని, వైసీపీ ఎమ్మెల్యేలు మాట్లాడటానికి కావాల్సినంత సమయం కూడా ఇస్తామని, వాళ్లు అసెంబ్లీకి రావాలని కోరుతున్నామన్నారు. ఇప్పుడైనా ఆ ధైర్యం చేయకుంటే దుష్ప్రచారాలు కట్టిపెట్టాల న్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఈ అసెంబ్లీలో ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా ఉండబోతుందన్నారు. సమావేశాలు విజయవంతంగా జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

**17న స్త్రీ శక్తి విజయోత్సవ కార్యక్రమం :** ఈ సందర్భంగానే ఈ నెల 17న గంగినేని ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు స్త్రీ శక్తి విజయోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని, మహిళలందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కోరారు. అక్కడే ఉచిత వైద్య పరీక్షల శిబిరం కూడా ఉంటుందని అన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్, బీపీ, షుగర్ పరీక్షలతో పాటు 70-80 రకాల వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మాజీ మంత్రి సురేష్‌ను పరామర్శించిన రాజ్యసభ సభ్యులు వై వి సుబ్బారెడ్డి



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, సెప్టెంబర్ 15)**
హైదరాబాద్ లో మాజీ మంత్రి కొండేపి నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తన నివాసంలో ఆరోగ్య సమస్యలతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు వైవి సుబ్బారెడ్డి సోమవారం సురేష్ నివాసానికి చేరుకుని ఆయనను పరామర్శించారు. అనంతరం వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు.

## గ్రామాల అభివృద్ధి, మౌళిక వసతుల కల్పనకు కృషి చేయాలి
### గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి







**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, సెప్టెంబర్ 15)**
గ్రామాల అభివృద్ధి, మౌళిక వసతుల కల్పనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. కొమరోలు ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని రెవిన్యూ, పంచాయతీ, వైద్య, అటవీ, శిశు సంక్షేమం, విద్యుత్ శాఖ, మండల అభివృద్ధి శాఖలతో సమీక్ష నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి గ్రామ పంచాయతీల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందని, గ్రామాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకారం అందించాల్సిందేనన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం చేయటంలో అలసత్వం తగదని, ప్రజలకు సేవ చేయటం అధికారుల బాధ్యత అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్‌లు గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి జలజీవన్ మిషన్ ద్వారా సురక్షిత త్రాగునీటిని అందించాలనే లక్ష్యంతో పాలన కొనసాగిస్తున్నామన్నారు. అన్నీ వర్గాల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నారావు, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, సొసైటీ బ్యాంక్ చైర్మన్ ముత్తుముల సంజీవరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో యూరియా కొరత లేదు
### రైతులు నిర్భయంగా వచ్చి యూరియా పొందవచ్చు
### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, సెప్టెంబర్ 15)**
సోమవారం బాపట్ల జిల్లాలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆర్ఎస్‌కెలు, పిఎసిఎస్ 35 కేంద్రాల ద్వారా 4983 మంది రైతులకు 220 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంకా 220 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## కిట్స్ కళాశాలలో ఘనంగా ఇంజనీర్ల దినోత్సవం

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టెంబర్ 15)**
కృష్ణ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కిట్స్) కళాశాలలో, ఇంజనీర్ల దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. భారత ప్రఖ్యాత ఇంజనీర్, "భారత రత్న" అవార్డు గ్రహీత, జాతీయ ప్రణాళికకర్త మొక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా, కిట్స్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రంగనాయకులు అధ్యక్షత వహించారు. విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బ్లాక్-ఎ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రంగనాయకులు మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య భారత ఇంజనీరింగ్ చరిత్రలో చిరస్మరణీయ వ్యక్తిత్వం. ఆయన కృషి, ఆవిష్కరణలు ప్రతి ఇంజనీర్‌కు మార్గదర్శకాలు. ఇంజనీరింగ్ అనేది కేవలం సాంకేతికతకే పరిమితం కాదు, అది సమాజానికి మేలు చేసే పరిష్కారాలను సృష్టించే శక్తి. మన విద్యార్థులు ఆయన స్ఫూర్తిని అనుసరించి కొత్త ఆవిష్కరణలతో ముందుకు సాగాలి" అని ప్రేరణాత్మకంగా పేర్కొన్నారు. విభాగాధిపతులు మాట్లాడుతూ "దేశ అభివృద్ధికి ఇంజనీర్లు వెన్నెముకలుగా నిలుస్తారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజ అవసరాలకు సరిపడేలా వినియోగిస్తేనే నిజమైన ఇంజనీరింగ్ విలువ బయటపడుతుంది" అని అన్నారు. కొంతమంది విద్యార్థులు మాట్లాడుతూ 'సర్ విశ్వేశ్వరయ్య జీవితం, కృషి మాకు ఎంతో ప్రేరణనిచ్చింది. ఆయన చూపిన దారిలోనే మేము కూడా ముందుకు సాగాలి" అని అన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఆయన పర్యవేక్షణలో ఎన్ఎస్ఎస్ బృందం సమన్వయంతో ఈ కార్యక్రమం సజావుగా జరిగింది. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎం విశ్వేశ్వరయ్య విశిష్ట సేవలను స్మరించి గౌరవం తెలియజేశారు.



## టిడ్కో ఇళ్లు నిర్మాణానికి రూ.180 కోట్లు కేటాయించాలి
### ఎమ్మెల్యే ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 15)**
పట్టణ పేదలకు గృహాలు కట్టిస్తామన్న ప్రభుత్వ హామీ మేరకు తక్షణమే రూ.180 కోట్లు కేటాయించి టిడ్కోఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆ మేరకు ఆ పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టిడ్కో 2018లో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) ప్రాజెక్టు కింద 4,120 మందికి అపార్ట్‌మెంట్ల తరహాలో నిర్మాణం చేపట్టి ఏడేళ్లు గడిచినా ఇళ్ళ అంశం లబ్ధిదారులకు కలగానే మిగిలిపోయాయన్నారు. ఇటీవల జరిగిన నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ఆరు నెలల్లో ఇళ్లు పూర్తి చేస్తాము, బ్యాంకులకు డబ్బు చెల్లించవద్దు అని హామీ ఇచ్చారని, ఆ హామీ నెరవేర్చాలంటే కనీసం రూ.180 కోట్లు వెంటనే కేటాయించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. అక్కడ చేపట్టిన కట్టడాలు ప్రమాదకరంగా ఉన్నట్లు తెలిపారు. నీరు, రోడ్లు, కరెంటు, డ్రైనేజీ సదుపాయాలు లేవని, చిల్లచెట్లు పెరిగి పాముల సంచారంతో అడవిలా తలపిస్తుందన్నారు. కాగా వైసిపి హయాంలో అగ్రహారం వద్ద 20 వేల మందికి సెంటు చొప్పున ఇచ్చిన ఇంటి స్థలాల స్థానం లో అర్హులైన వారందరికీ 2, సెంట్లు చొప్పున స్థలాలు ఇస్తామన్న హామీ అమలు కాలేదని విమర్శించారు. కాగా నగరంలో తాగునీటి సమస్య ఇంకా జఠిలంగానే ఉందన్నారు. శివారు కాలనీలకు కనీసం మూడు రోజులకు కూడా ట్యాంకర్ల ద్వారా నీరు అందించ లేని దుస్థితి లో పాలకవర్గం ఉందని ఆరోపించారు. ఇదిలా ఉండగా డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్న కారణంగా కొద్దిపాటి వానలకే వర్షపునీరు రోడ్డు పైకి రావడం, మురుగు ఏర్పడుతుందన్నారు. కాగా నగరంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, కుక్కలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అంతే గాకుండా నగర పరిధిలో 27 పార్కులు ఉన్నప్పటికీ వాకర్స్‌కి, పిల్లలకు కనీస సదుపాయాలు లేవని, జిమ్‌లు, టాయిలెట్లు, వంటి సౌకర్యం కల్పించాలన్నారు. రోడ్లు, స్మశానాల సమస్య, మసీదులు, చర్చిల వద్ద కనీస వసతులు లేకపోవడం వంటి అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com